పంటమార్పిడి అంతంత మాత్రమే

- వరి వైపు మొగ్గు చూపుతున్న రైతులు
- భూసారానికి తగ్గ పంట సాగు తక్కువే
- అవగాహన కల్పించామన్న అధికారులు



నాటేసేందుకు సిద్ధమవుతున్న వరినారు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు ఎక్కువగా వరి వైపు మొగ్గు చుపుతున్నారు. అన్ని రకాల పంట సాగు చేసిన రైతులు సైతం ఎక్కువగా వరి పంట సాగునే చేస్తున్నారు. తరుచూ రైతులు వరిసాగు చేయడంతో భూసారం తగ్గి, అధిక దిగుబడి మాట పక్కన ఉంచితే, భవిష్యత్‌లో వరి సాగు చేయడం కూడా కష్టమే. మండలంలో గత యాసంగిలో సీజన్‌లో సుమారుగా 11 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తే, ప్రస్తుత సీజన్‌లో సైతం 11 వేల ఎకరాల వరకు వరి సాగు చేయనున్నట్లు అధికారుల అంచనా. మండలంలో ఎక్కువగా మంజీరా పరివాహక ప్రాంతం ఉండటంతో రైతులు వరి సాగునే ఇష్టపడుతున్నారు. మంజీరా పరివాహక ప్రాంతాల్లోని రైతులు గతంలో వరి సాగులో అధిక దిగుబడి సాధించేవారు. మండలంలో చెరుకు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, కూరగాయాలకు కూడా సారవంతమైన నేలలు ఉన్నప్పటికీ వీటి సాగు తక్కువే. చెరుకు పంట సాగుకు సంవత్సరకాలం వ్యవధి, సరైన రవాణా వ్యవస్థ, చుట్టూ పక్కల అందుబాటులో చక్కెర పరిశ్రమలు లేకపోవడంతో చెరుకు సాగు తగ్గించామని పలువురు రైతులు తెలిపారు. ప్రస్తుతం రైతులు వేసిన తుకాలు ఎదగకపోతే సంక్రాంతి తర్వాత పెసర, మినుములు సాగుచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు అంటున్నారు. మండలంలో 15 ఎకరాల్లో చెరుకు, 15 ఎకరాల వరకు కూరగాయాలు, మరో 10 ఎకరాల్లో అయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. తమ నేలలో భూసార పరీక్షలు చేయించి, వాటికి తగిన పంటలు వేయాలని, దాంతో వేసిన పంటకు అధిక దిగుబడి సాధించగలరని అధికారులు తెలిపిన రైతులు వారి మాటలను వినడం లేదు.

వరి వైపే మొగ్గు



చిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే తెలిసింది వరి సాగు మాత్రమే. దాంతో నాకున్న ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్న. వర్షకాలం సీజన్‌లో మంచి దిగుబడి వచ్చింది. ఈ సీజన్ సాగు నీటి సౌకర్యం ఉండడంతో వరి సాగు చేస్తున్న.

– గోవిందు, రైతు, చిలప్‌చెడ్

అవగాహన కల్పించాం



మండలంలోని అన్ని గ్రామాల రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాం. నీటి వనరులు లేని రైతులకు ఆరుతడి పంట సాగు చేయాలని సూచించాం. భూసారాన్ని బట్టి భూమిలో ఉన్న పోషకాలను వినియోగించుకొని వాటికి తగ్గ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించాం.

– రాజశేఖర్, ఏఓ, చిలప్‌చెడ్

మెదక్ అభివృద్ధి పట్టదా?

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయకుమార్



మాట్లాడుతున్న పంజా విజయకుమార్

రామాయంపేట(మెదక్): మెదక్ అభివృద్ధి అధికార పార్టీకి పట్టదా అని బీజేపీ మెదక్ నియోకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్ ప్రశ్నించారు. సోమవారం రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి విషయమై ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇతర ప్రార్థనా మందిరాలకు నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల దేవాలయం అభివృద్ధి విషయమై ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వారు పలుమార్లు చేసిన ప్రకటనలు అమలు కాలేదన్నారు. అధికార పార్టీ వారు ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాల విషయమై త్వరలో ఆందోళన చేపడుతామన్నారు. సమావేశంలో పట్టణ ఇన్‌చార్జి సిద్ధరాములు, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, నాయకులు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి సరైన పత్రాలతో రావాలి

చిన్నశంకరంపేట(మెదక్): భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులు సరైన పత్రాలు తీసుకొని రావాలని తహసీల్దార్ మన్నన్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించి, అప్పటికప్పుడు వాటికి సమాధానం, వాటి స్టేటస్ వివరించారు. రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే సమయంలో సరైన పత్రాలతో వస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు.

18న మహా గణపతి ఆలయ వార్షికోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లిలో నిర్వహించే సంతోషిమాత, కుమారస్వామి సమేత మహా గణపతి పంచాయతన ఆలయం తృతీయ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గవ్వలపల్లి చౌరస్తాలోని గణపతి ఆలయంలో మండపారాధన, అభిషేకం, గణపతి హోమం, శివ పార్వతి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. మాధవనంద సరస్వతి స్వామి హాజరై ఆశీర్వచనం అందించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులుకాగాలరని కోరారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మెదక్ రూటులో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈనెల 16 నుంచి 18 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ హనుమాన్ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణం, అఖండ దీపారాధన, ఆరగింపుతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం దేవతారాధనలు, ఎదుర్కొళ్లు, సీతారామచంద్రస్వామి తిరు కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, నిత్యపూర్ణాహుతి, బుధవారం మహా పూర్ణాహుతి, శతఘటాభిషేకం, దివ్యాలంకరణ, అర్చన, రుత్విక్ సన్మానం, ఉత్సవాల పరిసమాప్తి కార్యక్రమాలు నిర్వహించనన్నట్లు గురుస్వామి లాలాగౌడ్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న మహేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్ బకాలు చెల్లించడంతో పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు చెల్లించి ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కలించాలన్నారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ ఎంపీఓ తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



ఇరుముడులతో శబరిమలకు తరలి వెళ్తున్న అయ్యప్ప స్వాములు

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్దచింతకుంట జలహనుమాన్ ఆలయంలో అయ్యప్పస్వాములు పూజలు చేశారు. సోమవారం గురుస్వాములు రాములు, అశోక్‌గౌడ్, నాగరాజు ఆధ్వర్యంలో నర్సాపూర్, చింతకుంట గ్రామాల స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమలకు తరలి వెళ్లారు.

మహాపడిపూజ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయం ఆవరణలో నరేశ్‌గౌడ్ స్వామి నిర్వహించిన పడిపూజలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నోట్ పుస్తకాల అందజేత**



చేగుంట(తూప్రాన్): మండలంలోని పెద్దశివునూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మిలీనియం యూత్ అధ్యక్షుడు అమృతరావు మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థుల చదువు కోసం చేయూత ఇవ్వడం కోసం నోటు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు, చార్టులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **ధర్నాకు కార్మికులు రావాలి**

తూప్రాన్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని మెదక్ జిల్లా టీవీఏసీ చైర్మన్ స్వామి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులపై అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

◆ **విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి**



అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి అల్లాదుర్గం శివారులో చోటు చేసుకుంది. బాధితుడు మేకలకాడి మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలో పాడిగేదెలు మేపుతున్నాడు. సాయంత్రం మేపుకుంటూ ఇంటికి వెళ్తుండగా విద్యుత్ వైర్ తెగిపడింది. విద్యుత్ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చినా.. వైర్ తొలగించలేదు. ఆటువైపు వెళ్లిన గేదెకు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. దీంతో రూ.80 వేల వరకు ఆర్థిక నష్టం జరిగిందన్నారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇస్తే స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పారు.

◆ **ఏపీజీవీ సేవలకు అంతరాయం**

మిరుదొడ్డి(దుబ్బాక): వరంగల్ ప్రధాన కేంద్రంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందిస్తున్న ఏపీజీవీబీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్న నేపథ్యంలో ఈ నెల 28 నుండి, 31 వరకు నాలుగు రోజుల పాటు సేవలకు అంతరాయం కలగనుందని అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యూపీఐ, నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, సీఎస్‌పీ సేవలు పూర్తిగా నిలిచి పోతాయన్నారు. అత్యవసర లావాదేవీలుంటే 27లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. జనవరి ఒకటి నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతో ఖాతాదారులకు సేవలను పునః ప్రారంభిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

దత్తాత్రేయకు సన్మానం



దత్తాత్రేయను సన్మానిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌గౌడ్

నర్సాపూర్: దేశ రాజధాని ఢిల్లీలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేసినట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీలో ఓబీసీ మోర్చా సమ్మేళనంలో పాల్గొనేందుకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు ఢిల్లీకి వెళ్లినట్లు ఆయన చెప్పారు. కాగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించినట్లు ఆయన చెప్పారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



అల్లాదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

అల్లాదుర్గం(మెదక్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చెవెళ్ల, అల్లాదుర్గం గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి కార్యదర్శులు సర్వే చేస్తామన్నారు.

ధనుర్మాసం ఉత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ధనుర్మాసంలో ప్రారంభమై నెల రోజుల పాటు తిరుప్పావై, సుదర్శన హోమం నిర్వహించనున్నారు. ప్రతీ ఆదివారం ఉగాది వరకు జాతర కనుల పండువగా నిర్వహించారు. ధనుర్మాసం మొదటిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు ధనుంజయ్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని అందె గ్రామంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్‌ను తరిమి కొట్టడానికి ప్రతి ఒక్కరు పాటు పడాలన్నారు. గ్రామీణ యువతను మేలుకొల్పడానికి 2కే రన్ పేరుతో మత్తును వది లించడానికి యువతను ఏకతాటిపైకి తేవడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీలింగం, సత్యనారాయణ, ఎండీ అహ్మద్, బాల్‌రాజు, శంకర్, భైరయ్య, ఐలయ్య, ప్రవీణ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జూట్‌బ్యాగ్‌ల తయారీపై ఉచిత శిక్షణ

విజ్ఞానజ్యోతి డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న దేవేందర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): జూట్‌బ్యాగ్‌ల తయారీపై విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యసంస్థ, వ్యవసాయ కళాశాలలో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో, తునికి గ్రామంలో మహిళలకు జూట్ అండ్ అలైడ్ ఫైబర్ ప్రొడక్ట్ కాప్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జూట్‌బ్యాగ్‌ల తయారీ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తునికి వద్ద గల విజ్ఞానజ్యోతిలో 18–45 ఏళ్ల లోపు మహిళలకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు చెప్పారు. ఉత్సాహం ఉన్న మహిళలు ఈనెల 21లోపు విజ్ఞానజ్యోతిలో దరఖాస్తుతో ఆధార్ కార్డు జతచేసి ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలకు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి డిప్యూటీ సీఈఓ సంజయ్‌కుమార్, శ్రీనివాస్, జగదీష్, సొసైటీ ప్రతినిధులు దీప, జయశ్రీ, ట్రైనర్ విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

అన్యమత ప్రార్థనలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని బాలికల రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాల (హాస్టల్)లో అన్యమత ప్రార్థనలు కొనసాగుతున్నాయని బీజేపీ, హిందూ సంస్థల ప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి ఆదివారం రాత్రి హాస్టల్‌కు వెళ్లి డ్యూటీలో ఉన్న టీచర్లను నిలదీశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కొంతకాలంగా హాస్టల్‌లో అన్యమత ప్రార్థనలతో సమీప కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని సముదాయించారు. కళాశాల ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

అధికారులు హెచ్చరించినా పట్టించుకోని ఇసుకాసురులు



బండపోతుగల్ గ్రామ శివారులోని మంజీరా వాగులో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామంలో అక్రమ ఇసుక రవాణా ఆగడం లేదు. గతంలో బండపోతుగల్ గ్రామంలో ఇసుక వ్యాపారులు భారీగా మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలించి, డంప్ చేసుకున్న కుప్పలను రెవెన్యూ అధికారులు సీజ్‌చేసి వేలం వేసినప్పటికీ, ఇసుకాసురుల పంథా మారడం లేదు. కాగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పట్టపగలే గ్రామ శివారులోని మంజీరా వాగు నుంచి ఇసుకకు అక్రమంగా తరలిస్తున్నాడు. పైగా వేలం వేసిన ఇసుకను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు తరలించాలనే అధికారుల ఆదేశాలను పట్టించుకొని పలువురు ఇసుక వ్యాపారులు రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నారు. సోమవారం ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి రాలేదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రయోగాలతో విద్యార్థులకు ప్రయోజనం



విద్యార్థులతో కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: ప్రయోగాలతో ఫార్మసి విద్యార్థులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని యూఎస్ ఎఫ్‌డీఏ ఎక్స్‌ఫర్ట్ ఫార్మాకాలజిస్ట్ డాక్టర్ జగదీష్ చెప్పారు. సోమవారం వైపర్ కాలేజీలో జరిగిన రీసెర్చ్ అండ్ క్లినికట్ ట్రయల్ ప్రొటోకాల్ డిజైన్ స్టాటిస్టికల్ విశ్లేషణ, ప్రచురణ అంశంపై వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫార్మసి రంగంలో ప్రయోగాలు చేయడం, వాటితో వచ్చే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో యూఎస్ ఎఫ్‌డీఏ ఫార్మకాలజిస్ట్ శ్రీనివాస్‌రాజు, రీసెర్చి డైరెక్టర్ బాలకుమార్ పిచ్చాయ్, హెడ్ కార్డియాలజీ డా.ఫ్రెడ్, పూణె యూనివర్శిటీ ప్రొఫెసర్ నగర్‌కార్ సుభద్ర, కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్న ఆర్‌ఐ



బండపోతుగల్ నుంచి జేసీబీని తరలిస్తున్న ఆర్ఐ సునీల్‌చౌహాన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అక్రమంగా తరలిస్తున్న మట్టి రవాణాను ఆర్ సునీల్ చౌహాన్ అడ్డుకున్న ఘటన మండలంలోని బండపోతగుల్ గ్రామంలో జరిగింది. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే విషయం తెలియడంతో, ఘటన స్థలానికి వెళ్లి, మట్టి తవ్వకాలను నిలిపివేసి, జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడల్లో రాణించినపుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించినపుడే మంచి గుర్తింపు లభిస్తుందని బేస్‌బాల్ అసోసియేసన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి అన్నారు. 14 నుంచి 16 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగిన బేస్‌బాల్ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషుల చాంపియన్ షిప్ పోటీల్లో సిద్దిపేట జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో సోమవారం క్రీడాకారులను అభినందించారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ పోటీల్లో దినేశ్ కార్తీక్, విఠల్, జగన్, దేవిశ్రీప్రసాద్ అవార్డులను అందుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రవీణ్‌గౌడ్, సెక్రెటరీ మధుయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని చైతన్య భారతి విద్యాలయానికి చెందిన 2003–2004 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, చంద్రమోహన్, శివరాజ్, పృథ్వీరాజ్, నాందేవ్‌లను సన్మానించారు.